జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 67 | బుధవారం 30 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## యుద్ధం ఆపాలని నాకు ఎవరూ చెప్పలేదు

### మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు మాట్లాడారు.. పాక్ భారీ దాడికి సిద్ధమవుతోందని బెదిరించారు



న్యూఢిల్లీ,జూలై 29 (సందేశం టైమ్స్): పహల్గాం ఉగ్రదాడి అంశంలో పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఆపాలని ఏ ప్రపంచ నేత కూడా భారత్‌ను అడగలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటు వేదికగా ప్రకటించారు. తానే భారత్, పాక్ యుద్ధాన్ని ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను తోసిపుచ్చేలా స్పష్టత ఇచ్చారు. మూడు దేశాలు తప్ప మొత్తం ప్రపంచ దేశాలన్నీ భారత్‌కే మద్దతు పలికాయని చెప్పారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం.. ఎంతో పరాక్రమం చూపిన మన సైనికులకు మద్దతుగా నిలవకుండా.. పాకిస్థాన్‌ను వెనకేసుకొచ్చేలా సందేహాలు వ్యక్తం చేశాయని మండిపడ్డారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో జరిగిన చర్చకు ప్రధాని మోదీ సమాధానం చెప్పారు. సుమారు రెండు గంటల పాటు ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించామని చెప్పడంతోపాటు కాంగ్రెస్‌పై విమర్శల తూటాలు ఎక్కుపెట్టారు. చివరగా పాకిస్థాన్‌కూ హెచ్చరికలు జారీ చేశారు.

**బుల్లెట్‌కు శతఘ్నితో సమాధానం**

ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనతో మాట్లాడారని ప్రధాని మోదీ వెల్లడించారు. "మే 9న రాత్రి నాతో మాట్లాడేందుకు జేడీ వాన్స్ మూడు, నాలుగు సార్లు కాల్ చేశారు. సైనికాధికారులతో సమావేశాలతో బిజీగా ఉన్నాను. చివరికి కాల్ మాట్లాడాను. పాకిస్థాన్ భారీ దాడి చేయబోతోందని జేడీ వాన్స్ నన్ను హెచ్చరించారు. పాకిస్థాన్ దాడి చేస్తే భారత్ అంతకు మించి బదులిస్తుందని.. వారు బుల్లెట్లు వాడితే మేం శతఘ్నులతో బదులిస్తామని ఆయనకు స్పష్టం చేశాను. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఆపాలని ప్రపంచంలో ఏ దేశానికి చెందిన ఏ నేత కూడా భారత్‌ను అడగలేదు. ఐక్యరాజ్యసమితిలో కేవలం మూడు దేశాలు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడాయి. మిగతా అన్ని ప్రపంచ దేశాల నుంచి భారత్‌కే మద్దతు లభించింది. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ మన దేశ సైనికులకు మద్దతుగా నిలవలేదు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ నేతలు నన్ను లక్ష్యంగా చేసుకుని గుప్పించిన అవివేకమైన ఆరోపణలు.. సైన్యం నైతిక విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి" అని మోదీ మండిపడ్డారు.

## ఆ నగరాల పరిస్థితి హైదరాబాద్‌కు రావద్దు

### ఢిల్లీ, ముంబై, చెన్నైలలో కాలుష్యంతో ఇబ్బందులు



హైదరాబాద్,జూలై 29 (సందేశం టైమ్స్): హైదరాబాద్ నగరంలో భూగర్భ డ్రైనేజీ, కేబుల్ వ్యవస్థపై దృష్టిసారించాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ఆయా శాఖలు సమగ్ర డీపీఆర్ తయారు చేయాలని నిర్దేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, నిర్మాణ రంగ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో మంచినీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థను సంస్కరించాలని, ప్రజలకు నాణ్యమైన తాగునీరు, మెరుగైన సేవలను అందించాలని సూచించారు. తనకున్న వనరులను సద్వినియోగం చేసుకునే అంశంపై జల మండలి ప్రత్యేక ప్రణాళికలను తయారు చేసుకోవాలని తెలిపారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం సీఎం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చాలని, విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ పరిస్థితి హైదరాబాద్‌లో తలెత్తకూడదని నిర్దేశించారు. రానున్న 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఢిల్లీ, ముంబై, చెన్నై నగరాల్లో తలెత్తిన సమస్యలపై అధ్యయనం చేయాలని చెప్పారు. కోర్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధిలో వారసత్వ కట్టడాల సంరక్షణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి వీలుగా కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల దీక్ష



పంజాగుట్ట, జూలై 29 (సందేశం టైమ్స్): స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్‌లో ఆగస్టు 4వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు తన దీక్ష కొనసాగుతుందని ప్రకటించారు. హైకోర్టు చెప్పిన గడువులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో.. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడమూ అంతే ముఖ్యమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకపోవడం, బీసీ బిల్లులపై రాష్ట్రపతి స్పందించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయ పోరాటం చేయట్లేదని ప్రశ్నించారు.సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం యునైటెడ్ పూలే ఫ్రంట్(యూపీఎఫ్), బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. బీసీ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించే సమయంలో అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ధర్నాను ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీనే పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కూడా ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లకుండా, పార్టీ పరంగా ధర్నా చేస్తామని చెప్పడం బీసీలను వంచించడమేనని ధ్వజమెత్తారు.

## దిగువకు కృష్ణమ్మ పరవళ్లు



నాగార్జునసాగర్/యాదాద్రి/హుజూర్‌నగర్, జూలై 29 (సందేశం టైమ్స్): నాగార్జునసాగర్ జలాశయం నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు మొదలయ్యాయి. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడం, గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉండడంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11:28 గంటలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ఉత్తమ్ తొలుత 13వ నంబరు గేటును ఎత్తేందుకు స్విచ్ ఆన్ చేశారు. అనంతరం మరికొన్ని గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. కృష్ణమ్మకు వాయినం సమర్పించారు. గేట్లు ఎత్తిన తర్వాత ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడిక తొలగించడంతో పాటు ఆధునికీకరిస్తామని చెప్పారు. సాగర్ ప్రాజెక్టు గేట్లు జూలై నెలలో ఎత్తడం 18 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 22 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తోందని తెలిపారు. తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఉంటూ ప్రస్తుతం మంత్రిగా ఉండి సాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత వానాకాలం, యాసంగి పంటలకు సాగు నీరు అందించామని.. ఫలితంగా 2.81 లక్షల టన్నుల ధాన్యాన్ని పండించి తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు.

## కేంద్రం బీసీ బిల్లును క్లియర్ చేయాలి

### కొత్త రేషన్ కార్డులకు.. 10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ వర్తింపు

### తాండూరులో డిప్యూటీ సీఎం భట్టి



తాండూరు, జూలై 29 (సందేశం టైమ్స్): దశాబ్దకాలం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు లబ్ధిదారులకు రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో రూ.230 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పించాలని బీసీ బిల్లును శాసన సభలో పెట్టి గవర్నర్‌కు, కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి పంపడం జరిగిందన్నారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఆ బిల్లును వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఇందుకోసం సీఎం రేవంత్ నాయకత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రజాప్రతినిధులు అందరం కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. కొత్తగా రాష్ట్ర వ్యాప్తంగా 95 లక్షల రేషన్ కార్డులు, 4.50 లక్షల ఇళ్లకు రూ.22,500 కోట్లు కేటాయించామన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం..




సిరిసిల్ల జూలై 29 (సందేశం టైమ్స్): కార్యకర్తలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ ఆర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాలకు చెందిన బీ ఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కేటీఆర్ సమావేశాలను నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమన్వయం ఐక్యతతో పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలలో గులాబీ జెండాను ఎగరవేయాలన్నారు. సిరిసిల్లలో పార్టీని ఓడించే వారెవరేలేరని కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు అభ్యర్థులే కనబడటం లేదన్నారు. మెజార్టీ స్థానాల ను గెలిచి అధికారాన్ని తిరిగి సాధించాలన్నారు.

# తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా శెట్టి వెంకటేష్ ను నియమించిన అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు.






తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్
(రిజిస్టర్ నెం. 301/2023)
Paiga plaza, 5th Floor, Flat No. 503, Liberty Cross Road, Basheerbagh, HYDERABAD, TELANGANA.
tjr1467@gmail.com
Cell: 7702152152
డా॥ జితేందర్‌రావు తనుగుల రాష్ట్ర అధ్యక్షులు

Ref. No.: Date:

3-82 మెయిన్ రోడ్ వాయిల సింగారం
అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా
పిన్ : 508206.
సెల్ : 90520 45435.
శెట్టి : వెంకటేష్

శెట్టి వెంకటేష్ S/O శ్రీనివాస్, వయస్సు 33, వృత్తి జర్నలిజం, సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక సీఈఓ, 29/07/2025 తారీకు నుండి తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా TYJF రాష్ట్ర అధ్యక్షులు Dr తనుగుల జితేందర్ రావు నియమించడం జరిగింది, TYJF తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నందు యూనియన్ అభివృద్ధి జర్నలిస్టుల రిక్రూట్మెంట్ మరియు జర్నలిస్టుల సమస్యలపై పోరాడటానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నందు నల్లగొండ యాదాద్రి భువనగిరి మరియు సూర్యాపేట జిల్లాల అధ్యక్షులను జిల్లాలలో అధ్యక్షులను జిల్లాలలో ఉన్నటువంటి నియోజకవర్గాల వారీగా అధ్యక్షులను మండలాల వారీగా అధ్యక్షులు అందరిని ఏకతాటిపై తీసుకువచ్చి జర్నలిస్టుల ఐక్యతను వారి గౌరవాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి అందుబాటులో ఉండాలని నియమించి పూర్తి ఉమ్మడి నల్లగొండ జిల్లా బాధ్యతలు అప్పగించడం జరిగింది.

ID NO : TYJF/TG/NLG/001
joining date: 29/07/2025
exp date: 31/12/2026

తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నందు ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా పదవి స్వీకరించడం నాకు అంగీకారం

S. Venkatesh
29/07/2025

Dr. Jithender Rao Thanugu
TYJF State President
Mobile: 7702152152

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక సీఈఓ శెట్టి వెంకటేష్ గౌడ్ ను తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా నియమించడం జరిగింది, జర్నలిజంపై ఉన్న ఆసక్తిని గమనించిన డాక్టర్ తనుగుల జితేంద్ర రావు ఉ మ్మడి నల్గొండ లో ఉన్న జర్నలిస్టుల ఆశయాల కోసం వారి శ్రేయస్సు కోసం టీ వై జె ఎఫ్ నుండి జర్నలిస్టులకు ఎటువంటి సమస్య వచ్చిన వారికి అండదండగా ఆసరాగా నిలబడతామని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సూర్యాపేట జిల్లా, నల్లగొండ జిల్లా, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్నటువంటి జర్నలిస్ట్ మిత్రులందరికీ కూడా మన తెలంగాణ యూత్ జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యత్వం తీసుకొని యూనియన్ బలపరిచి జర్నలిస్టుల ఐక్యతను చాటాలని అన్నారు, అదేవిధంగా తెలంగాణ యూత్ జర్నలిస్టు ఫెడరేషన్ నుండి జర్నలిస్టుల కొరకు కార్పస్ పండును ఏర్పాటు చేయడం జరుగుతుంది ఈ ఫండ్ ను పేద మరియు బలహీన అనారోగ్యంతోనే ఇంకా వేరే కారణాలతో ఇబ్బంది పడి జర్నలిస్టులకు కచ్చితంగా కార్పస్ ఫండ్ తోటి ఆదుకుంటామని రాష్ట్ర అధ్యక్షులు తనుగుల జితేందర్ రావు అన్నారు, అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా టి వై జె ఎఫ్ అధ్యక్షుడు మాట్లాడుతూ భారతదేశపు మాజీ ప్రధాని మనవడు అయినటువంటి డా తనుగుల జితేందర్ రావు స్థాపించినటువంటి తెలంగాణ యూత్ జర్నలిస్టు ఫెడరేషన్ నందు మండలం జిల్లా అధ్యక్షుడు పదవిని తీసుకోవడం గర్వంగా ఉందని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జర్నలిస్టులకు అందరికీ అందుబాటులో ఉంటానని ప్రతి ఒక్క జర్నలిస్టు మిత్రుడు మన యూనియన్ నందు జాయిన్ అయి ఫెడరేషన్ బలపరచాలని అదేవిధంగా ఒకరికొకరం సహకారాలు అందించుకోవాలని ఎవరికైనా ఏదైనా కష్టం వచ్చినా లేదా బెదిరింపులు వచ్చిన వెంటనే తన నెంబర్ ను సంప్రదించాలని తెలియజేశారు 9052045435.

## ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ను మర్యాద పూర్వకంగా కలిసిన పూల మొక్కలను అందించిన ఇన్స్పెక్టర్



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 29జూలై: గౌరవ మల్టీ జోన్ -%××% డిప్యూటీ ఐజి తఫ్సీర్ ఇక్బాల్ ఐపిఎస్ గారి ఉత్తర్వుల ప్రకారం ట్రాన్స్ఫర్ అయినటువంటి ఇన్స్పెక్టర్ భాద్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందచేయడం జరిగింది.

1) విజయ్ కృష్ణ ఇన్స్పెక్టర్ - %దీణా% భానూర్
2) కిరణ్ కుమార్ ఇన్స్పెక్టర్ - స్పెషల్ బ్రాంచ్ సంగారెడ్డి
3) వెంకట్ రెడ్డి ఇన్స్పెక్టర్ -కంగ్టీ సర్కిల్

## అందోల్ లో మీనాక్షి నటరాజన్ గారి పర్యటన ను విజయవంతం చేయాలి .

### ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి . సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి.
### మీనాక్షి నటరాజన్ చేపట్టిన పాదయాత్ర లో స్వచ్ఛందంగా కార్యకర్తలు వేలాది గా పాల్గొనాలి.



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 29జూలై సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మంత్రి దామోదర్ రాజనరసింహ వెల్లడించారు

తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆగస్టు 1న సాయంత్రం 5 గంటలకు అందోల్ నియోజక వర్గంలో చేపట్టిన పాదయాత్ర తో పాటు ఆగష్టు 2న జరిగే శ్రమదానం , పార్టీ కార్యకర్తల తో సమావేశం ను విజయవంతం చేయటానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి అధ్యక్షతన సంగారెడ్డి లోని తన నివాసం లో నియోజక వర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ పార్టీ లో ఉన్న అన్ని విభాగాల శ్రేణులు స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పార్టీ ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ కోరారు.

## జోగిపేట,వట్ పల్లి పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ






### పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డుల పరిశీలన
### విజిబుల్ పోలిసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాలి
### బెట్టింగ్స్, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాల నిర్వహించాలి.
### ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధిలోనీ ఈ రోజు తేది: 29.07.2025 నాడు జోగిపేట, వట్ పల్లి పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిశుభ్రత, స్టేషన్ రికార్డుల మెయింటెనెన్స్ పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్ లో ఉండాలని, ప్రతి ఫిర్యాదును క్లుప్తంగా విచారణ చేపట్టాలని అన్నారు. ఇన్వెస్టిగేషన్ లో ఎలాంటి సందేహాలున్న ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని ఎస్. హెచ్. ఓ లకు సూచనలు చేశారు.సిబ్బంది ప్రతి ఒక్కరు అన్నిరకాల విధులను చేయగలిగే విధంగా, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతను అందించుకోవాలన్నారు. ప్రతిరోజు విజిబుల్ పోలిసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ మన చుట్టూ జరుగుతున్న నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. డయల్-100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని, తొందరగా నేరస్థలానికి చేరుకున్నట్లయితే నేరం తీవ్రతను తగ్గించడానికి అవకాశం ఉ ంటుందన్నారు. సిబ్బంది, అధికారులు స్టేషన్ హెడ్ క్వార్టర్ లో అందుబాటులో ఉండాలని దూరప్రాంతాలకు నుండి ప్రయాణం ప్రమాదకరం అన్నారు. నేరాల నియంత్రణ, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ.., స్వచ్ఛందంగా సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చేల చూడాలని, డాబాలు, పెట్రోల్ పంపులు, విద్యాసంస్థలలో సిసి కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా యాజమాన్యాలకు సూచించాలని అన్నారు.

## 31న గురుకుల ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు



హైదరాబాద్, జూలై 29 (సందేశం టైమ్స్): గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన సీట్లకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. బుధవారం నుంచి వెబ్సైట్లో ఖాళీ సీట్ల జాబితా అందుబాటులో ఉంటుందని తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలను పారదర్శకంగా మెరిట్ ఆధారంగా భర్తీ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్లో మంగళవారం వర్షిణి మీడియాతో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఉన్న అన్ని సీట్లు భర్తీ అయ్యాయని ఆమె తెలిపారు. సంక్షేమ గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన పోషకాహార భోజనాలు అందించడానికి కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు.

వ్యవసాయ మహిళా డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఆగస్టు 15లోగా దరఖాస్తులు


గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈఏపీసెట్-2025లో అర్హత సాధించిన విద్యార్థినులు ఈ నెల 30 నుంచి ఆగస్టు 15లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి బడుగు సైదులు తెలియజేశారు. అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# సంపాదకీయం

## శోకధ్రువ ప్రపంచంలో గాజాకాష్టం

గాజాను తలచుకుంటే తల తిరిగి పడిపోతామేమో, గుండె పగిలి చస్తామేమో నన్న భయంతో ప్రపంచం అటువైపు కన్నెత్తి చూడడం లేదనిపిస్తోంది. ఇరవై మాసాల కాలంలో 70,000 మందిని, అత్యధికంగా పిల్లలను, మహిళలను బలి తీసుకున్న ఇజ్రాయెల్, దాని వెన్ను దన్ను అమెరికా అచ్చోసిన ఆంబోతుల్లా విశ్వం నడివీధుల్లో బోర విరుచుకు తిరుగుతున్నాయి. ఈ ఘన కార్యానికి గాను ట్రంప్‌కి ఈ ఏడాది నోబెల్ బహుమతి ఇవ్వాలని నరహంతకుల్లో నంబర్ వన్ జాబితాలో చేరిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సిఫారసు చేశాడు, పులికి తోడేలు వంత పాడినట్టు!గాజా నేడొక నరరక్త జీవనది. ఈ రోజుటి లెక్క రేపటికి మాయమై మృతుల కొత్త సంఖ్య తెర మీదికి వస్తున్నది. చైనా, రష్యా సహా ఎవరూ దీనికి అడ్డుకట్ట వేయలేకపోవడం కంటే దయనీయస్థితి ఉండదు. అందుకే గాజాలో ఈ నిరంతర అగ్నివర్షం ఒక కలలా అనిపిస్తున్నది, మనం మానవేతర అమానుష సమాజంలో బతుకుతున్నామనే నమ్మలేని నిజం కళ్లకు కడుతున్నది. ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలతో అమెరికా విశ్వవిద్యాలయాలు అట్టుడికిపోతే ట్రంప్ ప్రభుత్వం ఆ ప్రదర్శనలలో పాల్గొన్న విదేశీ విద్యార్థులను బంధించి స్వదేశాలకు పంపించివేయటమే గాక, హార్వర్డ్ వర్సిటీకి నిధులను నిలిపివేసింది. కొలంబియా, కార్నెల్, నార్త్ వెస్టన్ వంటి ప్రముఖ కళాశాలలపై కక్షతో వ్యవహరించింది. గాజన్ల రక్తంలో ట్రంప్ తనివితీరా స్నానం చేయడం ఎంతవరకు వెళ్లిందంటే వేలాదిమంది పాలస్తీనియన్లను బలి తీసుకోవడాన్ని ఖండించిన ఐక్యరాజ్యసమితి నియమిత హక్కుల స్వతంత్ర ఉద్యమకారిణి ఫ్రాన్సెస్కా ఆల్బనీస్‌పై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది.ట్రంప్ రెండోసారి సారథ్యంలో అమెరికా తన పునాది ఆదర్శాలైన స్వేచ్ఛ, అవకాశాలు, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, సమానత్వం అనే మహత్తర అంశాలకు స్వస్తి చెబుతున్నది. ఒకప్పుడు అలీనోద్యమాన్ని నిర్మించిన ఇండియా ఇప్పుడు ట్రంప్‌కి ఇజ్రాయెల్‌కి దాసోహమంటున్నది. అమానుషాలను ప్రతిఘటించడంలో ప్రపంచం రోజురోజుకీ బలహీనమైపోతున్నది. దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సంఘటితం కాలేకపోతున్న అశక్తత నలువైపులా తాండవిస్తున్నది. దీనికి కారణాలను వెతికి అరికట్టకపోతే పాత రాచరికాలు ఆధునిక రూపంలో తిరిగి పుంజుకునే ప్రమాదం కనిపిస్తున్నది. అప్పుడు నియమబద్ధ అంతర్జాతీయ వ్యవస్థకు అంతిమ దినాలు దాపురిస్తాయి. ట్రంప్ ఆగ్రహ అనుగ్రహాలను బట్టి ప్రతి ఒక్కరూ బతకవలసి వస్తుంది. ట్రిగ్గర్ మీద వేలుపెట్టి దేశదేశాలను భయపెడుతున్న ట్రంప్ విధానాలను అదుపులో ఉంచే దిశగా మానవాళి లోతుగా ఆలోచించాలి. జనరల్ అసెంబ్లీ అభీష్టాన్ని కాలరాసే భద్రతామండలికి శాశ్వతంగా తెరపడాలి. బలవంతులు యూదు మత విశ్వాసాల ఆధారంగా ఇజ్రాయెల్ దేశానికి పాలస్తీనాలో ఉనికి కల్పించినప్పుడు అరబ్ దేశాలు సంఘటితంగా ప్రతిఘటించాయి. ఈజిప్ట్, సిరియా, లెబనాన్, ఇరాక్‌లు అరబ్ లీగ్ పతాకం కింద పోరాడాయి. అటువంటి అరబ్ ఐక్యత ఇప్పుడు గాలికి పేలపిండి అయిపోయింది. వాస్తవానికి యూదులకు అవసరమైన దానికంటే ఎక్కువ పాలస్తీనా భూభాగాన్ని మొదట్లోనే వారికి కట్టబెట్టారు. అప్పట్లో పాలస్తీనా జనాభాలో సగం మంది కంటే తక్కువమందిగా ఉన్న యూదులకు సగం పాలస్తీనా కంటే ఎక్కువ భూభాగం లభించింది. 1967లో ఆరు రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్ తన భూభాగాన్ని విశేషంగా విస్తరించుకున్నది. జోర్డాన్, ఈజిప్ట్, సిరియాలలో భాగాలను, జెరూసలేం పాత నగరాన్ని, సినాయి ద్వీపకల్పాన్ని, గాజాను, జోర్డాన్ నది పశ్చిమ తీరాన్ని, గోలాన్ హైయిట్స్‌ను దురాక్రమించుకున్నది. అగ్గికి ఆజ్యంలా టెల్ అవివ్‌కి బదులు జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించి అమెరికా తన రాయబార కార్యాలయాన్ని అక్కడికి తరలించింది. ఇజ్రాయెల్ పుట్టినప్పటి నుంచి ఇంతవరకు అమెరికా దానికి చేసిన సాయం 300 బిలియన్ డాలర్ల దాకా ఉంటుంది. ఇందులో ఎక్కువ భాగం సైనిక సాయమే. 2023 అక్టోబర్ 7న హమాస్ మెరుపు దాడి చేసిన తర్వాత ఇజ్రాయెల్‌కు అమెరికా చేసిన అదనపు సైనిక సాయం విలువ 4.86 బిలియన్ డాలర్లు. మరొక సమాచారం ప్రకారం 2023 అక్టోబర్ 7 అనంతరం ఇజ్రాయెల్‌కు అమెరికా 17.19 బిలియన్ డాలర్ల సైనిక సాయం అందించడానికి నిర్ణయించింది. ఈ పొగరుతో ఇజ్రాయెల్ ఒక్క పాలస్తీనియన్ల పైనే కాదు ఇతర అరబ్ దేశాలపైనా దాడులకు దిగుతోంది. తాజాగా, సిరియాలోని డ్రుజ్ అనే మైనారిటీ వర్గంతో శాంతి చర్చలు విఫలం కావడంతో ఆ వర్గానికి దన్నుగా, సిరియా రాజధాని డమాస్కస్ పైనే ఇజ్రాయెల్ దాడులు చేపట్టింది. ఇటీవలనే ఇరాన్ నాయకులను కొందరిని హతమార్చిన అమెరికా ఇంతకుముందు 2020 జనవరిలో ట్రంప్ మొదటి విడత పరిపాలనా కాలంలో ఇరాన్ ముఖ్య సైనికాధికారి సోలేమానిని డ్రోన్ దాడి ద్వారా హతమార్చింది. మొన్న మొన్న మరికొందరు కీలక ఇరాన్ అధికారులను పొట్టనపెట్టుకున్నది. దేశాధినేత అలీ ఖమేనీనే హతమార్చాలని చూసింది. ఆయన కొన్ని రోజులు బంకర్‌లో తల దాచుకున్నారు. ఏ దేశ సార్వభౌమాధికార పరిధులనూ గౌరవించే సంస్కారం, మర్యాద అమెరికాకు లేవు. దానిని, దాని విష పుత్రిక ఇజ్రాయెల్‌నూ ఎదుర్కోడం దక్షిణాసియా దేశాలకు సాధ్యం కాదు. అక్కడి పాలకులు తమ ప్రజల్లోని పోరాట శక్తిని తామే చంపివేస్తున్నారు. దీనికి తోడు అంతటా ఆవహించిన పెట్టుబడిదారీ మారణాస్త్రమైన వినియోగ సంస్కృతి అక్కడా వేళ్లూనుకున్నది.

# పెన్సిల్ ముల్లుపై వైట్‌హౌస్.. ట్రంప్ ప్రశంసలు



నక్కపల్లి,జూలై 29 (సందేశం టైమ్స్) : పెన్సిల్ ముల్లుపై అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌ను రూపొందించిన మన కళాకారుడు ట్రంప్ మనసు దోచుకున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గట్టెం వెంకటేశ్ ట్రంప్ ప్రశంసలు అందుకున్నారు. న్యూ యార్క్‌లో ఆర్కిటెక్ ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న గట్టెం వెంకటేష్ పెన్సిల్ ముల్లుపై 2 సెం.మీ. పొడవు, 1 సెం.మీ. వెడల్పుతో వైట్‌హౌస్‌ను తీర్చిదిద్దారు. ఈ నెల 4న అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఎగ్జిబిషన్‌లో వెంకటేశ్ తన కళాఖండాన్ని ప్రదర్శించారు. వెంకటేశ్ తయారుచేసిన కళాఖండం గురించి వైట్ హౌస్ అధికారులు అధ్యక్షుడు ట్రంప్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో వెంకటేశ్‌ను ప్రశంసిస్తూ వైట్‌హౌస్ ప్రశంసాపత్రాన్ని విడుదల చేసింది.

# విశాఖ భూకబ్జాలపై ప్రత్యేక నివేదిక



విశాఖపట్నం,జూలై 29 (సందేశం టైమ్స్) : విశాఖపట్నంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పలువురు వైసీపీ నేతలే విశాఖలో భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. విజయనగరం జిల్లాకు చెందిన వైసీపీ నేత సతీమణి తన భూమి బలవంతంగా రాయించుకున్నారని ఒకరు ఫిర్యాదు చేశారని తెలిపారు. అలాగే ఎంపీగా పనిచేసిన వ్యక్తి నిర్మించిన భవనంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఫిర్యాదు చెప్పారు. విశాఖలో భూకబ్జాలపై రెవెన్యూ యంత్రాంగం నివేదిక తయారు చేస్తోందని తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక విధానం తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. 22-ఎ నుంచి తమ భూములను తప్పించాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయని తెలిపారు. పంచ గ్రామాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు.

# సాహస నారి.. సైకిల్ యాత్ర



అరకులోయ,జూలై 29 (సందేశం టైమ్స్) :తెలంగాణలోని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయ.. 44 రోజుల పాటు ఏకంగా 1,300 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర! సైక్లింగ్‌పై ఫ్యాషన్‌తో ఆ సాహసయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసింది తెలంగాణకు చెందిన వెన్నెల అనే ఓ యువతి. గతంలో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడంతో పాటు గత ఏడాది కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు కూడా సైకిల్ యాత్ర చేపట్టినట్లు ఆమె చెప్పారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనేది తన కోరిక అని పేర్కొన్నారు. వెన్నెల గత నెల 14న హైదరాబాద్ నుంచి సైకిల్‌పై బయలుదేరి.. తిరుపతి, తదితర ప్రాంతాలను సందర్శిస్తూ ఆదివారం అరకు లోయ చేరుకున్నారు. ఆమెకు ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ మోహన్, అరకు జనసేన ఇన్‌చార్జి చిరంజీవి, నేచర్ నెస్ట్ రిసార్ట్స్ యాజమాన్యం సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెన్నెల తన ప్రయాణ విశేషాలను సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఆ వివరాలు ఆమె మాటల్లో.. హైదరాబాద్ నుంచి అరకులోయ వరకు సైకిల్ యాత్ర చేయాలని సంకల్పించి.. గత నెల 14న అక్కడ నుంచి బయలుదేరాను. మహిళా సాధికారత, వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాను. ఈ ప్రయాణంలో చాలా మంది నన్ను ప్రోత్సహించారు. వారి ఇళ్లకు తీసుకెళ్లి ఆతిథ్యం ఇచ్చేవారు. కొన్నిసార్లు రాత్రి వేళల్లో పెట్రోల్ బంకుల వద్ద విశ్రాంతి తీసుకునేదాన్ని. నాకు తిరుపతి, అరకులోయ చాలా బాగా నచ్చాయి' అని తెలిపారు.

# వారిని లోకల్‌గానే పరిగణించండి



**ఆ విద్యార్థుల దరఖాస్తులు స్వీకరించండి**

**ఎన్టీఆర్ వర్సిటీకి హైకోర్టు ఆదేశం**

**తెలంగాణలో ఇంటర్ చదివినవారికి ఊరట**

అమరావతి, జూలై 29 (సందేశం టైమ్స్) ::వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో తమను లోకల్ అభ్యర్థులుగా పరిగణించి, దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ రాష్ట్రానికి చెందిన పలువురు విద్యార్థులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు ధర్మాసనం అత్యవసర విచారణ జరిపింది. పిటిషనర్లను లోకల్ అభ్యర్థులుగా పరిగణించి, వారి దరఖాస్తులు స్వీకరించాలని ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంపై సవివరంగా కౌంటర్ దాఖలు చేయాలని యూనివర్సిటీకి స్పష్టం చేసింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నీట్‌లో అర్హత సాధించినా, ఇంటర్ తెలంగాణలో చదివామనే కారణంతో వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో తమను లోకల్ అభ్యర్థులుగా పరిగణించకపోవడాన్ని సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన ఎస్కే ఖమరుద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన సనపల వెంకటరమణ మరో 51మంది వేరొక పిటిషన్ వేశారు.




# ఉరుకులు.. పరుగులు

**నేడు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత**

**చాలాచోట్ల సాగుతున్న కాలువల మరమ్మతులు**

**ప్రధానమైనవి పూర్తికి కసరత్తు**

**గందరగోళానికి గురవుతున్న అధికారులు**

జూలై 29 (సందేశం టైమ్స్) ::సాగునీటి అవసరాలకు సాగర్ జలాలొస్తున్నాయి. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తోంది. గత అనుభవాల దృష్ట్యా ఊహించిన దాని కన్నా చాలా ముందుగానే ఈ ఏడాది సాగర్ నీటి విడుదల జరిగింది. ఈనేపథ్యంలో కాలువల్లో చేపట్టిన పనులపై ఆ శాఖ అధికారులు గందరగోళ పడుతున్నారు. మేజర్లు, మైనర్‌ల మరమ్మతులు ఎలా ఉన్నా కనీసం ప్రధాన, బ్రాంచి కాలువల్లో పనులు అయినా పూర్తి చేయాలని చూస్తున్నారు. అయితే ఐదారు మాసాల క్రితం వచ్చిన రాష్ట్ర ప్రకృతి విపత్తుల ఫండ్ (ఎస్‌డీఎంఎఫ్) కింద చేపట్టిన పనులు తప్ప ఇటీవల ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్ఎం) కింద మంజూరైన పనులు చేయడం సాధ్యం కాక తలపట్టుకుంటున్నారు.ఒంగోలు, : ఉమ్మడి జిల్లాలో సుమారు 4.34 లక్షల ఎకరాల ఆయకట్టు సాగర్ కాలువల పరిధిలో ఉంది. అందులో బాపట్ల జిల్లాలోనిది 1.71 లక్షల ఎకరాలు కాగా, మిగిలినది ప్రస్తుత ప్రకాశం జిల్లాలోనిది. ఉమ్మడి జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో సాగర్ నీటి ఆధారంగా పంటలు వేస్తున్నారు. మిగిలిన లక్షా 34వేల ఎకరాలలో వర్షాధారంగానే సాగు చేస్తారు. ఏటా సాగర్ నీటి ఆధారంగా సాగు చేసే మూడు లక్షల ఎకరాల్లో సుమారు లక్ష ఎకరాల్లో మాగాణి, మిగిలిన రెండు లక్షల్లో ఆరుతడి పంటలు ఉంటాయి. గత ఏడాది సుమారు 2.75 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 85వేల ఎకరాల్లో వరి, మిగిలిన లక్షా 90వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు వేశారు. ఈ ఏడాది అంతకన్నా మించి సాగయ్యే అవకాశం ఉంది. కృష్ణా నది ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలతో వరద నీరు ఈనెల తొలిపక్షం నాటికే రాష్ట్రంలోని కీలక రిజర్వాయర్లు అయిన శ్రీశైలం, సాగర్‌లకు చేరుతుండటాన్ని గమనించిన రైతులు విస్తారంగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.డ్యామ్‌లలో పుష్కలంగా నీరు చేరి, సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నా ఆ నీటిని పొలాలకు చేర్చే విషయంపై ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం ఆందోళన చెందుతున్నారు.

## 5న విద్యుత్తు ఉద్యమానికి కదం తొక్కండి: సీపీఐ



అమరావతి, జూలై 29 (సందేశం టైమ్స్) : వామపక్షాలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వచ్చేనెల 5న అన్ని జిల్లాల్లో విద్యుత్తు కార్యాలయాల వద్ద తలపెట్టిన విద్యుత్తు ఉద్యమాన్ని విజయవంతం చేసేందుకు కదం తొక్కాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమస్యపై వైసీపీ నోరు మెదపడం లేదని, అధికారంలో ఉన్నప్పుడు అదానీతో ఒప్పందాలు చేసుకోవడమే దీనికి కారణమని ఆయన విమర్శించారు. విద్యుత్తు చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, అదానీతో చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేసేందుకు ప్రభుత్వం దిగివచ్చేలా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని సోమవారం నిర్వహించిన జూమ్ మీటింగ్ ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## కింగ్‌కోబ్రా గుడ్లను సంరక్షించి.. అడవిలోకి వదిలి!





జూలై 29 (సందేశం టైమ్స్) :అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం జీనబాదు రెవెన్యూ పరిధిలోని శంకరం అటవీ ప్రాంతంలో అటవీ శాఖాధికారులు ఆదివారం 30 కింగ్‌కోబ్రా పిల్లలను విడిచిపెట్టారు. ఆ ప్రాంతంలో నెల రోజుల కిందట 30 కింగ్‌కోబ్రా గుడ్లను అటవీ శాఖాధికారులు, వైల్డ్ లైఫ్ సొసైటీ కో ఆర్డినేటర్ మూర్తి గుర్తించారు. ఆ గుడ్లకు రక్షణగా నెట్ ఏర్పాటు చేశారు. నెల రోజుల తర్వాత ఆ 30 గుడ్ల నుంచి పిల్లలు బయటకు రావడంతో.. వాటిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అంతరించిపోతున్న జాతుల్లో కింగ్ కోబ్రా ఒకటని, వాటి రక్షణకు కృషిచేస్తున్నామని అటవీ శాఖ అధికారులు శాంతిప్రియ, దివాన్ మొహిద్దీన్ చెప్పారు.

## జంట హత్యల కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

మక్కువ/ బెలగాం,జూలై 29 (సందేశం టైమ్స్) :మక్కువ మండలంలోని చెముడు పంచాయతీ పాలికవలసలో 2018లో నమోదైన జంట హత్యల కేసులో గిన్నిపల్లి సింహాద్రికు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయాధికారి ఎస్.దామోదరరావు సోమవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మక్కువ మండలం పలికివలస గ్రామానికి చెందిన ఒమ్మి పైడిరాజు తన తల్లితండ్రులు ఒమ్మి సోములు, నారాయణమ్మలను అదే గ్రామానికి చెందిన గిన్నిపల్లి సింహాద్రి హత్య చేశాడని మక్కువ పోలీస్ స్టేషన్‌లో 2018లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో నిందితుడు సింహాద్రిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారన్నారు. సంబంధిత నేర శోధనకు కృషి చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

## ఎంపిఆర్‌డిసి విద్యార్థులకు బంగారు పతకాలు

విజయపురిసౌత్ జూలై 29 (సందేశం టైమ్స్) :నేపాల్‌లోని పొక్రాలో నిర్వహించిన ఇండో-నేపాల్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయపురిసౌత్ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభను చాటించారు. 200 మీటర్ల పరుగులో జొన్నలగడ్డ నాగరవీంద్ర, 100 మీటర్ల పరుగులో అంజి నాయక్, లాంగ్‌జంప్‌లో హరికృష్ణ నాయక్ బంగారు పతకాలు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ షేక్.నయీమ్ భాను, అధ్యాపకులు అభినందించారు.



## మహిళలకు ఉపాధి కల్పించాలి : ఐద్వా

దుత్తలూరు :జూలై 29 (సందేశం టైమ్స్) :మండలంలోని చింతలగుంట గ్రామంలో మహిళలకు ఉపాధి కల్పించాలని ఐద్వా నాయకులు పేర్కొన్నారు. స్థానిక మహిళలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి శివకుమారి, షేక్ మస్తాన్ బీ మాట్లాడుతూ చింతలగుంట గ్రామంలోని మహిళలు వెనుకబడిన వర్గానికి చెందిన వారిని పేద కుటుంబాలని రోజువారి కూలి పనులకు వెళ్లి కుటుంబాలను జరుపుకుంటున్నారని, కావున మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వారికి పనులు కల్పించాలన్నారు. స్థానిక మహిళలందరూ పొదుపు గ్రూపులో నిర్వహించుకుంటున్నారని కావున పొదుపు మహిళలందరికీ ప్రభుత్వం ద్వారా కుట్టు సెంటర్లను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఆ విధంగా వారికి ఉపాధి కల్పించాలని కోరారు. చింతలగుంట గ్రామంలో 9 మందితో



మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బి రమ్య, కార్యదర్శిగా డి లీలమ్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## అతివేగమే ప్రమాదాలకు కారణం: ఎస్పీ



చిత్తూరు అర్బన్‌జూలై 29 (సందేశం టైమ్స్) : అతివేగంగా వాహనాలను నడపటమే ప్రమాదాలకు కారణమని ఎస్పీ మణికంఠ చెప్పారు. సాయుధ పోలీసు దళ కార్యాలయంలో స్లో మోటారు సైకిల్ రేస్ పోటీలను ప్రారంభించిన ఆయన ప్రసంగించారు. దేశంలో ప్రతి ఏడాది 1.60 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, 4 లక్షల మందికిపైగా గాయాలపాలవుతున్నారని చెప్పారు. ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం, వేగంగా వాహనాలను నడపటమే ఇందుకు కారణమన్నారు. ప్రతి ఒక్కరూ సమయానుసారంగా ప్రయాణాలు చేస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. పోటీల్లో పది మంది మహిళలు, 90 మంది పురుషులు పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను యాదమరి మండలం వరదరాజులపల్లెకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ అరుణ్‌కుమార్, ఏఆర్ పీసీ యోగవేంద్రన్, సీనియర్ ప్రొఫెసర్ పవన్‌కుమార్ గెలుచుకున్నారు. వీరికి రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలను విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తితో కలిసి ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సాయినాథ్, చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్య తదితరులు పాల్గొన్నారు.

# వనితా.. ఓ వ్యాపార వేత్త!



- పొదుపు మహిళలతో 'తృప్తి' క్యాంటీన్లు
- రుణ సదుపాయం కల్పించి ఆర్థిక భరోసా
- మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలో 55 క్యాంటీన్లు
- మహిళాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి

ఒంగోలు కార్పొరేషన్‌జూలై 29 (సందేశం టైమ్స్) :మహిళాభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తూ ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. ముఖ్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా పేద, మధ్యతరగతి మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో అనేక కార్యక్రమాలకు శ్రీకా రం పలికింది. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించ డంతోపాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండేలా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 'తృప్తి' క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు తొలుత నెల్లూరు పట్టణంలో పైలట్ ప్రాజెక్టుగా మేలో క్యాంటీన్‌ను ప్రారంభిం చగా,శనివారం విజయవాడలో పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్‌లు ప్రారంభించారు. త్వరలోనే ఏపీ మెప్మా, శారా ప్రాజెక్టు ఉమ్మడి భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా 750 క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు, ఇతర మునిసిపాలిటీలలో సుమారు 55 'తృప్తి' క్యాంటీన్లు తెరవనున్నారు. ఈ దిశగా మెప్మా ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.నిర్వహణ విధానం ఇలా తృప్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వమే సహకారం అందించనుంది. 20-12 సైజు కంటైనర్లను సమకూర్చడంతోపాటు, ప్రతి నలుగురు మహిళలను ఒక యూనిట్‌గా తీసుకుని వారికి క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించనుంది. అందుకోసం వంటశాల నిర్వహణపై శిక్షణ అందించనుంది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకునిఎలక్ట్రిక్ పరికరాలను, సోలార్ విద్యుత్‌తో వంటశాలను తీర్చిదిద్దనున్నారు. ఒక్కో క్యాంటీన్ నిర్వహణకు రూ.16.40 లక్షలు అవసరం ఉందని పురపాలక శాఖ అంచనా వేసింది. దీంతో యూనిట్ సభ్యులుగానలుగురు ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు మొత్తం 75శాతం పెట్టుబడిగా నిర్ణయించారు. మిగిలిన నిధులను శారాస్ ఏజెన్సీ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తారు. ఈ నిధులతో కంటైనర్, యంత్ర పరికరాలు, సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్, ఇతర అవసరాలను మెప్మా ప్రాజెక్టు అందజేస్తారు.

ప్రతి రోజూ రూ. 10వేలకుపైనే ఆదాయం

తృప్తి క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి, ఆదాయ వ్యయాలను అధికారులు లెక్కకట్టారు. వారి అంచనా ప్రకారం నెలవారీ టర్నోవర్ సుమారు రూ.6.39 లక్షలు వస్తుందని భావిస్తుండగా, అందులో నిర్వహణ ఖర్చు రూ.3.92 ఖర్చులు పోను రూ.2.46 లక్షలు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే ఈ క్యాంటీన్లలో ఆహార పదార్థాల ధరలకు బయట మార్కెట్‌లో ధరలకు పెద్దగా వ్యత్యాసంఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు.జిల్లాలో 55 క్యాంటీన్‌లు మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేయనున్న 'తృప్తి' క్యాంటీన్లు జిల్లాలో 55 ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. మొదట జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని ప్రగతిభవన్, జీజీహెచ్ ఆసుపత్రి వద్ద, నెల్లూరు బస్టాండ్, రైల్వేస్టేషన్, గుంటూరు రోడ్‌లో వీటిని ఏర్పాటు చేసేందుకు మెప్మా, కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలాలను గుర్తించారు.

## దసరా ఉత్సవాలు 11 రోజులు

విజయవాడ, జూలై 29 (సందేశం టైమ్స్) : ఇంద్రకీలాద్రిపై నిర్వహించే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ ఏడాది 11 రోజులపాటు జరగనున్నాయి. సెప్టెంబరు 22వ తేదీన ప్రారంభమయ్యే మహోత్సవాలు అక్టోబరు 2న ముగుస్తాయి. ఈ వివరాలను శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థాన ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, ప్రధానార్చకుడు దుర్గాప్రసాద్ మహామండపంలో వెల్లడించారు. ఈ ఏడాది తిథి వృద్ధి చెందడంతో శరన్నవరాత్రులను 11 రోజులపాటు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది. అమ్మవారికి ఏటా పది అలంకారాలు ఉంటాయి. ఈ ఏడాది సెప్టెంబరు 25న కొత్తగా అమ్మవారు కాత్యాయినీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి పదేళ్లకు ఒకసారి తిథి వృద్ధి చెందుతుంది. దీంతో శరన్నవరాత్రులు 11 రోజులపాటు జరుగుతాయి. ఇంతకుముందు 2016లో ఈవిధంగా జరిగింది. నాడు తిథి వృద్ధి చెందడంతో కాత్యాయినీదేవిగా అమ్మవారిని అలంకరించారు. తిరిగి ఈ ఏడాది అమ్మవారికి ఆ అలంకారం చేయనున్నారు. సెప్టెంబరు 29వ తేదీన అమ్మవారు జన్మనక్షత్రం మూలానక్షత్రం రోజున సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. అదేరోజు సీఎం చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

# సుందరయ్య కాలనీ విద్యార్థుల ఆందోళన



మార్కాపురం :జూలై 29 (సందేశం టైమ్స్) : వసతులతో కూడిన పాఠశాల భవనాన్ని నిర్మించాలని సుందరయ్య కాలనీ విద్యార్థులు, మహిళలు ఆందోళన బాట పట్టారు. మార్కాపురం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. వివరాలిలా ఉన్నాయి.. మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలకల పారిశ్రామికవాడ సమీపంలో గల సుందరయ్య కాలనీలో ప్రభుత్వ పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో అందరూ కార్మిక కుటుంబాలకు చెందిన విద్యార్థులే చదువుతున్నారు. పాఠశాలకు సొంత భవనం లేదు. అద్దె భవనంలో పాఠశాల నిర్వహణలో ఉంది. ఆ భవనం కాస్తా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అసౌకర్యాల నడుమ ఆ పాఠశాల కొనసాగుతోంది. పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని పలుమార్లు విద్యార్థుల తల్లిదండ్రులు కోరినా ఫలితం లేకపోయింది. చేసేదేమీ లేక సాయంత్రం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కలిసి ఆందోళనబాట పట్టారు. మార్కాపురం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ ఆందోళనకు సిపిఎం పట్టణ కార్యదర్శి డికెఎం రఫీ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న పాఠశాల భవనం దెబ్బతిందన్నారు. చిన్నపాటి జల్లు కురిసినా కారుతోందన్నారు. వర్షం వస్తే ఆ పాఠశాలకు సెలవు ప్రకటించాల్సి వస్తోందన్నారు. శిథిలమైన భవనం కావడంతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయన్నారు. పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదానికి గురవుతారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. మరుగుదొడ్లు, వంటగది లేవన్నారు. ప్రభుత్వం పట్టించుకోని ఫలితంగా ప్రతి ఇంటికీ రూ.200 చొప్పున చందాలతో కొంత పైకం కూడబెట్టారన్నారు. ఆ డబ్బుతో స్కూల్ భవనం మొదలు పెట్టగా వసూలైన డబ్బు అయిపోవడంతో అర్ధాంతరంగా నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ఆగిపోయిన భవనం నిర్మాణం పూర్తయ్యేందుకు అయ్యే ఖర్చు మున్సిపాలిటీ భరించాలని కోరారు. స్కూల్ అభివృద్ధి కోసం అంటూ తల్లికి వందనం నుంచి రూ.2 వేలు తగ్గించారని, ఆ నిధులు అదే స్కూల్ అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. అక్కడ విద్యార్థుల సంఖ్య 85 వరకు ఉందన్నారు. ఈ విధంగా రూ.1.70 లక్షల నిధులు తల్లికి వందనం నుంచి పట్టుకున్న డబ్బు ఉందన్నారు. ఆ నిధులను ఖర్చు చేసిన ఆగిపోయిన భవన నిర్మాణంలో కొంత పని జరుగుతుందన్నారు. తక్షణమే పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పి రూబెన్, కాశయ్య, ఎస్‌కె నన్నేషా, ఐద్వా పట్టణ కార్యదర్శి జి శార, బుజ్జమ్మ, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు విక్టర్, ఎలిషా, ఆదినారాయణరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు వందనం, విద్యా కమిటీ చైర్మన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# పాఠశాలల గోడల మీద నోటీసులు అంటించిన వారిపై చర్యలు




చల్లపల్లి (కృష్ణా) :జూలై 29 (సందేశం టైమ్స్) : ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడలపై విచ్చలవిడిగా వివిధ రకాల నోటీసులు, పోస్టర్లు అంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అధికారులను కోరారు. చల్లపల్లి మండలం, లక్ష్మీపురం నాడు-నేడు ప్రాథమికోన్నత పాఠశాల గోడపై పాఠశాల వాతావరణం దెబ్బతీసేలా పలురకాల పోస్టర్లు అంటించటం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై పోస్టర్ లు అంటించే ధైర్యం ఎవరూ చేయరని, కేవలం ప్రభుత్వ పాఠశాలల పట్ల ఉన్న చిన్నచూపు వైఖరి కారణంగానే ఈ విధంగా గోడలను పాడు చేస్తున్నారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల గోడలపై నోటీసులు అంటించకుండా ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల ఇలాంటి చర్యల వల్ల పాఠశాలలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆశయాలను సమాజంలో తక్కువ చేసేలా ఉంటాయన్నారు.

# రైతు సేవాకేంద్రాలలో సమృద్ధిగా యూరియా

ప్రొద్దుటూరు రూరల్, జూలై 29 (సందేశం టైమ్స్) :ప్రొద్దుటూరు డివిజన్‌లోని అన్ని రైతు సేవాకేంద్రాలలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడ యూరియాను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిత పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణంపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్బంగ్ ఈపాస్ యంత్రంలోని వివరాలతోపాటు అక్కడి రికార్డులను పరిశీలించారు. ఎరువులను ఎమ్మార్పీకే అమ్మాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికి ప్రొద్దుటూరు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 25.8 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యతలో ఉందన్నారు. జమ్మలమడుగు మండలంలో 49.5 టన్నులు, పెద్దముడియం మండలంలో 29.7 టన్నులు, మైలవరం మండలంలో 19.8 టన్నులు యూరియా అందుబాటులో ఉంచామన్నారు. మరో రెండు రోజుల్లో జమ్మలమడుగు మండలానికి 60 మెట్రిక్ టన్నులు, ప్రొద్దుటూరు మండలానికి 20, మైలవరం మండలానికి 20, అలాగే ప్రొద్దుటూరులోని చౌటపల్లి రైతు సేవాకేంద్రానికి 10 మెట్రిక్ టన్నులు, పెద్దశెట్టిపల్లె రైతు సేవాకేంద్రానికి 10 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా సరఫరా కానుందని వివరించారు.

# నేడు నీటి విడుదల



విజయపురిసౌత్: జూలై 29 (సందేశం టైమ్స్) :నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మంగళవారం ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు సోమవారం తెలిపారు. జులైలో గేట్ల ఎత్తివేత 2007 తర్వాత ఇప్పుడే కావడం గమనార్హం. సాగర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండడంతో ప్రాజెక్టు అధికారులు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగర్ గేట్లను మంగళవారం ఉదయం 10 గంటలకు తెరిచి దిగువ కృష్ణకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలంగాణ సాగర్ ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి సూపరిండెంట్ ఇంజినీర్ మల్లికార్జున్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ జలాశయం పూర్తి స్థాయినీటి నిల్వ 312 టిఎంసిలు కాగా రాత్రికి 297 టిఎంసిలకు చేరింది. గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585 అడుగుల వద్ద ఉంది. ఎగువ నుంచి 1,47,195 క్యూసెక్కుల నీరు వస్తుండగా 43 వేల క్యూసెక్కులు కాల్వలకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు 35,937 క్యూసెక్కులు వస్తుండగా 10 వేల క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజికి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజికి 12,075 క్యూసెక్కులు ఎగువ నుంచి వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు.ఇదిలా ఉండగా ఎగువ కృష్ణా ప్రాంతంలోని జలాశయాలు పూర్తిస్థాయిలో నిండడంతో శ్రీశైలానికి భారీగా నీరు వస్తోంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.10 అడుగుల వద్ద ఉంది. ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ 215.80 టీఎంసీలకు గాను ప్రస్తుతం 199.27 టీఎంసీలున్నాయి. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేసి 66,232 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శనివారం రాత్రి భారీగా వరద ఉండటంతో అధికారులు రెండు గేట్లు ఎత్తివేశారు. ఆదివారం ఉదయానికి ప్రవాహం తగ్గడంతో ఒక గేటును మూసి ప్రస్తుతం ఒక గేటు ద్వారా 26,744 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టుకూ నీరు చేరుతో నిండుకుండను తలపిస్తోంది. కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తూ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

# గిరిజన సమస్యలు పరిష్కరించాలి




అనంతసాగరం జూలై 29 (సందేశం టైమ్స్) : మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో ఉన్న గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఛలో కలెక్టర్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి తమ సమస్యలను గిరిజనులు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ పడమటి కంభంపాడు గ్రామంలో దాదాపు 30 సంవత్సరాల నుండి గిరిజనులు సోమశిల ఉత్తర కాలువ పక్కన గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారన్నారు. కంప చెట్ల మధ్య పాములు, తేళ్లు వంటి విష పురుగుల మధ్య జీవిస్తున్నారని తెలిపారు. కరెంట్ స్తంభాలు వేశారు కానీ స్తంభాలకు కరెంట్ సప్లై ఇవ్వలేదన్నారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇవ్వాలని, ఇళ్లు లేక గుడిసెలో ఉన్నారని వారికి పక్కా కాలనీ ఇళ్లు మంజూరు చేసి నిర్మించాలన్నారు. జంగిల్ క్లీనింగ్ ద్వారా కంప చెట్లు తొలిగించాలని, మంచి నీటి సౌకర్యం, రోడ్లు నిర్మించి గిరిజన కాలని అభివృద్ధి చేయాలన్నారు. కలెక్టర్ స్పందించి గిరిజనుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారని తెలిపారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంలో పడమటి కంభంపాడు గిరిజనులు పాల్గొన్నారు.

# తూమకుంట ఎస్‌బిఐలో భారీ చోరీ



హిందూపురం జూలై 29 (సందేశం టైమ్స్) : శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సమీపంలోని తూమకుంట పారిశ్రామిక వాడలోని ఎస్‌బిఐ ఆధ్వర్యంలో రాత్రి భారీ చోరీ జరిగింది. అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి గ్యాస్ కట్టర్లతో కిటికీ గ్రిల్స్ తొలగించి బ్యాంకులోకి చొరబడ్డారు. నగదును దాచిన లాకర్లను గ్యాస్‌కట్టర్లతో పగులుగొట్టి డబ్బులను దోచుకెళ్లే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయితే నగదు ఎంత అపహరణకు గురైందన్న విషయాన్ని పోలీసులు, బ్యాంకు సిబ్బంది ఇంకా నిర్ధారణ చేయలేదు. ఇందుకు సంబంధించి పోలీసులు, బ్యాంకు సిబ్బంది తెలిపిన వివరాల మేరకు%ా% హిందూపురం పారిశ్రామిక వాడలో ఎస్‌బిఐ బ్యాంకు ఉంది. బ్యాంకు వెనుక ఉన్న పెద్ద కిటికీ గ్రిల్స్‌ను గ్యాస్ కట్టర్ సాయంతో తొలగించి లోపలికి వెళ్లారు. అనంతరం బ్యాంకుల్లో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కత్తిరించారు. స్ట్రాంగ్ రూమ్‌లోకి చొరబడి లాకర్లను గ్యాస్ కట్టర్‌తో తొలగించి, అందులో ఉన్న నగదుతో పాటు ఖాతాదారులు రుణం కోసం కుదువ పెట్టిన బంగారం పాకెట్లను దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. ఎన్ని లాకర్లు ఓపెన్ చేశారు.? నగదు ఎంత పోయింది.? బంగారం ఎంత ఎత్తుకెళ్లారు.? అన్న వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కాగా సోమవారం ఉదయం బ్యాంకులోకి వచ్చిన సిబ్బంది దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ డీఎస్పీ మహేష్, సిఐ అబ్దుల్ కరీంలు సిబ్బంది బ్యాంకు వద్దకు చేరుకున్నారు. సిసి ఫుటేజ్‌లను పరిశీలించారు. క్లూస్ టీంతో బ్యాంకులో అణువణువునా తనిఖీ చేశారు. పూర్తి స్థాయి తనిఖీల అనంతరం వివరాలను వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు.

# వైద్య వర్గాల్లో కలకలం



జూలై 29 (సందేశం టైమ్స్) ::స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రి (ఎన్టీఆర్ వైద్యాలయం)లో గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన జారీ చేసిన ఆదేశాలు ప్రభుత్వ వైద్య వర్గాల్లో కలకలం సృష్టించాయి. అప్పట్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వైద్యులు, సిబ్బందిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లిలోని ఎన్టీఆర్ వైద్యాలయంలో పలు అక్రమాలు జరిగాయి. ఇన్‌పెషేంట్ల తప్పుడు లెక్కలు, మందుల వినియోగాన్ని రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయకపోవడం, లెసెన్సు లేకుండా క్యాంటీన్ నిర్వహణ, రోజూ ఎంతమంది రోగులకు భోజనాలు సరఫరా చేస్తున్నారో రికార్డుల్లో నమోదు చేయకపోవడం, రోగులకు సరఫరా చేసే ఆహారంలో నాణ్యత లేకపోవడం వంటి ఆరోపణలు వచ్చాయి. వీటిపై అందిన ఫిర్యాదుల మేరకు 2020 ఫిబ్రవరిలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. అప్పటి డీసీహెచ్‌ఎస్‌తోపాటు తొమ్మిది మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు/ స్టాఫ్ నర్సులు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారుల బృందం గుర్తించింది. వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే తరువాత నాలుగేళ్లపాటు అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం.. అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా, ఏసీబీ ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో జరిగిన ఏసీబీ తనిఖీలు, అప్పటి ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టి సారించారు. వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసిన ఏసీబీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన 22 మంది వైద్యులు, సిబ్బందిపై శీఘ్రగతిన విచారణ చేయాలని ఆదేశించారు. ఈ విషయం పత్రికల్లో ప్రముఖంగా రావడం

# 'సృష్టి' వ్యవహారంపై మానవ హక్కుల కమిషన్ సీరియస్..




జూలై 29 (సందేశం టైమ్స్) :అమ్మతనాన్ని అంగడి సరకుగా మారుస్తున్న సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అరాచకాలపై మానవ హక్కుల కమిషన్( సీరియస్ అయింది. ఈ కేసును సుమోటోగా స్వీకరిస్తూ.. ఆగస్టు 28లోపు పూర్తి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో డాక్టర్ నమ్రత సహా ఇప్పటివరకూ 8 మందిని గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితులకు మారేడుపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కాగా, నిందితులను కస్టడీకి కోరుతూ పోలీసులు కోర్టును ఆశ్రయించారు.సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమ బాగోతాలపై ఇప్పటికే తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సీరియస్ అయింది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి ఎథిక్స్ కమిటీ విచారణకు ఆదేశించింది. 2016లోనే %ు+వీజ% డాక్టర్ నమ్రత మెడికల్ లైసెన్స్ ఐదేళ్లపాటు రద్దుచేసింది. 2021లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కోర్టులో కేసులు పెండింగ్ ఉన్నందున అంగీకరించారు. అయినప్పటికీ వేరే డాక్టర్ల లైసెన్సుల ద్వారా డాక్టర్ నమ్రత ప్రాక్టీసు కొనసాగిస్తూనే ఉన్నారు. సికింద్రాబాద్‌లో అక్రమంగా ఫెర్టిలిటీ సెంటర్ నడుపుతూ అక్రమంగా వీర్యం, అండాలను సేకరిస్తూ భారీ దందాకు పాల్పడుతున్నారు. అలాగే, సరోగసీ ద్వారా పిల్లల్ని కనాలని ఆశించే దంపతులకు వేరే వాళ్లకు పుట్టిన పిల్లలను కట్టబెడుతూ.. చైల్డ్ ట్రాఫికింగ్ చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

# పంపిణీకి సిద్ధంగా కొత్త రేషన్‌కార్డులు..



**– చివరిదశకు చేరుకున్న దరఖాస్తుల పరిశీలన**

**– ఇప్పటికే అర్హుల జాబితా సిద్ధం**

**– త్వరలోనే కార్డులు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు**

హైదరాబాద్:జూలై 29 (సందేశం టైమ్స్) :కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలో సుమారు 80వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాలలో దరఖాస్తులు పరిశీలించిన అధికారులు అర్హులైన వారిని గుర్తించారు. అనర్హులుగా తేలినవారి దరఖాస్తులను ఇప్పటికే తిరస్కరించారు.మరికొన్ని చోట్ల పరిశీలన ఇంకా కొనసాగుతోంది. బడుగు బలహీనవర్గాలకు చెందిన ఎంతో మంది ఏళ్లుగా నూతన రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్() ప్రభుత్వం పదేళ్ల కాలంలోనూ రేషన్‌కార్డుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. వారంతా ఇప్పుడు నూతన కార్డు కోసం ఎదురుచూస్తున్నారు.రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆగస్టు 10లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తుండడంతో సివిల్ సప్లై అధికారులు దానికి తగ్గట్టుగానే అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బాలానగర్ ఏఎస్ఓ కార్యాలయం పరిధిలో 28,660 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 14,460 దరఖాస్తులను అధికారులను పరిశీలించారు. 7,200 మంది రేషన్ కార్డులకు అర్హులుగా గుర్తించారు. 3,860 దరఖాస్తులను తిరస్కరించగా, మరో 3,400 రేషన్ కార్డులు పరిశీలిస్తున్నారు. అర్హులకు త్వరలోనే రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

# బీసీల సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం



పంజాగుట్ట, జూలై 29 (సందేశం టైమ్స్) :బీసీల సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కళాకారుల ఆత్మీయ కలయిక పేరుతో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం బీసీ కవులు, కళాకారులు ఒక్కటవ్వాలన్నారు. ఈ సందర్భంగా వారు బీసీ కల్చరల్ ఫోరం వేదికను ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్, మహాత్మ జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ వి. చిన్నశ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.బీసీల గురించి అత్యుత్తమ పాట రాసిన వారికి రూ.5 లక్షలు, రెండో పాటకు రెండు లక్షలు, మూడో అత్యుత్తమ పాటకు లక్ష రూపాయల చొప్పున నగదు బహుమతులు అందజేస్తానని వి.చిన్న శ్రీశైలం యాదవ్ ప్రకటించారు. అనంతరం బీసీ కల్చరల్ ఫోరం నూతన కార్యవర్గాన్ని జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కోదారి శ్రీను, ఉపాధ్యక్షులుగా అభినయ శ్రీనివాస్, అంబటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా దరువు అంజన్న, కోశాధికారిగా రామలింగం ఎన్నికయ్యారు.

# ఆట మధ్యలో ఆగిన యువకుడి గుండె!

**షటిల్ ఆడుతూ కుప్పకూలి మృతి**


**హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఘటన**

**మృతుడి స్వస్థలం ఖమ్మం జిల్లా తల్లాడ**



ఉప్పల్/తల్లాడ, జూలై 29 (సందేశం టైమ్స్) :రోజూ మాదిరిగానే స్నేహితులతో కలిసి షటిల్ ఆడేందుకు వెళ్లిన ఓ యువకుడు ఆట మధ్యలోనే కుప్పకూలి ప్రాణాలొదిలాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ ఉపసర్పంచ్ జి.వెంకటేశ్వర్‌రావు కుమారుడు రాకేశ్ (26) హైదరాబాద్‌లోని ఓ ఈవీ వాహన కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే ఎప్పటిలాగే స్నేహితులతో కలిసి ఉప్పల్ భగాయత్‌లోని ఎలైట్ బ్యాడ్మింటన్ అకాడమీకి రాత్రి వచ్చాడు. ఈ క్రమంలోనే రాత్రి 8 గంటల సమయంలో వారితో షటిల్ ఆడుతూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలాడు.వెంటనే సహచరులు అతడిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే రాకేశ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనకు సంబంధించి అకాడమీ సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం రాకేశ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు తల్లాడకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

# అమెరికాలో గుండెపోటుతో ఎత్తోండ వాసి మృతి



కోటగిరి జూలై 29 (సందేశం టైమ్స్) :: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తోండ గ్రామానికి చెందిన వడ్లమూడి హరికృష్ణ (49)అనే యువకుడు అమెరికాలోని వర్జినియా రాష్ట్రంలో ఓ సరస్సులో బోటింగ్ చేస్తూ గుండె పోటుతో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఎత్తోండ గ్రామానికి చెందిన హరికృష్ణ 25 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లి సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తన భార్య ఇద్దరు పాప లతో కలిసి ఓ సరస్సుకు బోటింగ్ వెళ్ళాడు.%అదే సమయంలో ఒక్క సారిగా హరికృష్ణకు గుండెపోటు రావడంతో సరస్సులో పడిపోయాడు. గమనించిన తన స్నేహితుడి కుమార్తె సరస్సులోకి దిగి హరికృష్ణ పైకి తీసుకొచ్చింది. గుండెపోటు గురైన హరికృష్ణకు సీపీఆర్ ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. హరికృష్ణకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు

# కూన శ్రీశైలం గౌడ్ సోదరుడి వేధింపులతో ఉద్యోగి ఆత్మహత్య



కేపీహెచ్‌బీకాలనీ, జూలై 29 (సందేశం టైమ్స్) : మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోదరుడైన కూన శ్రీనివాస్ గౌడ్ వేధింపులు తాళలేక ఆయన కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న అంకెనపల్లి కుమార్ (28) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కూకట్‌పల్లి వెంకటరావునగర్‌లో ఉండే కుమార్ ఎనిమిదేళ్లుగా బాచుపల్లిలోని శ్రీనివాస్ గౌడ్‌కు చెందిన సమ్మక్క-సారక్క క్రషర్ సంస్థలో పనిచేస్తున్నాడు. కుమార్ కారణంగా గత పది రోజుల్లో తనకు రూ.కోటి నష్టం వాటిల్లిందని, ఆ మొత్తం అతడే చెల్లించాలంటూ శ్రీనివాస్ గౌడ్, అక్కడి సిబ్బంది కలిసి కుమార్‌ను వేధిస్తున్నారు. ఇంటికొచ్చి తల్లిదండ్రులు, భార్యను తగులబెడతామని అతడిని హెచ్చరించారు. కుమార్ కంపెనీకి వెళ్లగా.. అతడి ఫోన్, కారు, ఐడీ కార్డు ను లాక్కొని కొట్టారు. ఆ ఫోన్‌లో వ్యక్తిగత డేటా చూసి తీవ్రంగా అవమానించారు. అతడి బ్యాంక్ బ్యాలెన్స్ చెక్‌చేసి 'ఈ మొత్తం అంతా మాదే కదా'? అని ప్రశ్నించారు. అదేరోజు రాత్రి కుమార్ ఇంటికొచ్చాడు. జరిగిందంతా భార్యకు, ఫోన్ చేసి తన స్నేహితులకు చెప్పుకొని పడుకున్నాడు. ఉదయం ఇంట్లోవాళ్లు లేచి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. కుమార్ భార్య బావోజు మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కుమార్‌కు 27 రోజుల వయసున్న కూతురు ఉంది.

# తొర్రూరులో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య..

## మృతదేహంతో స్కూలు ముందు బైఠాయించిన బంధువులు



మహబూబాబాద్ జిల్లా:జూలై 29 (సందేశం టైమ్స్) : మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో విషాదం చోటుచేసుకున్నది. పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మట్రికుంట తండాకు చెందిన వెంకట చైతన్య.. తొర్రూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో (అభ్యస్) పదో తరగతి చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో రాత్రి వెంకట చైతన్య తానుంటున్న హాస్టల్‌లో ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. %విషయం తెలుసుకున్న విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో తొర్రూరుకు చేరుకున్నారు. విద్యార్థి మృతదేహంతో స్కూలు గేటు మందు బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్నవారిని శాంతిపజేశారు. విద్యార్థి మృతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆయిల్‌పాం సాగుతో ఆదాయం ఘనం



**30 ఏళ్ల పాటు రైతులకు మంచి లాభం**

**ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం**

**ఉమ్మడి జిల్లాలో ఏటా విస్తరిస్తున్న సాగు**

**స్థానికంగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్**

నెక్కొండ/కురవి,జూలై 29 (సందేశం టైమ్స్) : ఆయిల్‌పామ్ తోటల సాగు ఏటా విస్తరిస్తున్నది. వరికి ప్రత్యామ్నాయంగా దీర్ఘకాలికంగా లాభాలు తెచ్చిపెట్టే పామాయిల్‌ను గత కేసీఆర్ సర్కారు అందుబాటులోకి తెచ్చింది. సబ్సిడీతో పాటు 30 ఏళ్ల పాటు రాబడి వస్తుందని, ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం వస్తుందని ఉద్యానవనశాఖ అధికారులు అవగాహన కల్పించడంతో దీన్ని సాగు చేసేందుకు రైతులు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. మూడు, నాలుగేళ్ల నుంచి ఉమ్మడి జిల్లాలో సాగు విస్తరిస్తున్న క్రమంలో ఇక్కడే ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నెలకొల్పితే అందరికీ అనుకూలంగా ఉంటుందనే అభిప్రా యం వ్యక్తమవుతోంది. వరంగల్ జిల్లాలో ఈ యేడు రెం డింతల్లో మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తుండగా, మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటికే 8,024 ఎకరాల్లో సాగవుతున్నది.




# క్రీడావార్తలు




## ఐదో టెస్టుకు ముందే కెన్నింగ్టన్ ఓవల్లో టీమ్ ఇండియా రికార్డు

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య చివరి, ఐదో టెస్ట్ జులై 31 (గురువారం) నుంచి లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్‌లో మొదలు కానుంది. ప్రస్తుతం 2-1 స్కోరుతో ఇంగ్లండ్ ముందంజలో ఉంది, కానీ ఓల్డ్ ట్రాఫర్డ్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా 143 ఓవర్లు బ్యాటింగ్ చేసి డ్రా చేయడంతో ఈ సిరీస్‌ను ముగించే అవకాశాన్ని ఇంగ్లండ్?కు తప్పించింది. ఇది క్రికెట్‌లో చరిత్రలో అరుదైన సాహసమని క్రీడా వర్గాలు అంటున్నాయి.కెన్నింగ్టన్ ఓవల్‌లో భారత్ గత రికార్డు చూస్తే, ఇంగ్లండ్‌లోని ఇతర మైదానాలతో పోలిస్తే ఇక్కడ మెరుగైన ప్రదర్శన కనబరిచింది. 1936 నుంచి ఇప్పటివరకు ఈ వేదికపై భారత్ 15 టెస్ట్ మ్యాచ్‌లు ఆడగా, రెండు సార్లు విజయం సాధించింది, ఆరు సార్లు ఓడిపోయింది, ఏడు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. భారత్ తొలి విజయం 1971లో సాధించగా, రెండో విజయం 2021లో వచ్చింది. ఈ మైదానంలో భారత్ మూడు సార్లు ఇన్నింగ్స్ తేడాతో ఓడిపోయింది.భారత్ చివరిసారిగా ఓవల్‌లో ఇంగ్లండ్‌తో 2021 సెప్టెంబర్‌లో తలపడింది. అప్పటి కెప్టెన్ విరాట్ కోహ్లీ నాయకత్వంలో. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ కేవలం 191 పరుగులకే కుప్పకూలింది. కోహ్లీ అర్ధ సెంచరీ (50) సాధించినప్పటికీ, జట్టు 127/7 వద్ద కష్టాల్లో పడింది. అయితే, శార్దూల్ ఠాకూర్ 36 బంతుల్లో 57 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 62/5 వద్ద కష్టాల్లో పడినప్పటికీ, ఓలీ పోప్ (81), క్రిస్ వోక్స్ (50), జానీ బెయిర్‌స్టో, మోయిన్ అలీల సహకారంతో 290 పరుగులు చేసి 99 పరుగుల ఆధిక్యం సాధించింది.రెండో ఇన్నింగ్స్‌లో భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. రోహిత్ శర్మ తన తొలి విదేశీ టెస్ట్ సెంచరీ (127)తో అదరగొట్టాడు. పుజారా, రిషబ్ పంత్,




శార్దూల్ ఠాకూర్‌లు అర్ధ సెంచరీలతో రాణించగా, కేఎల్ రాహుల్ (46), కోహ్లీ (44) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. దీంతో భారత్ 466 పరుగుల భారీ స్కోరు సాధించి, ఇంగ్లండ్‌కు 368 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇంగ్లండ్ ఓపెనర్లు రోరీ బర్న్స్, హసీబ్ హమీద్ 100 పరుగుల భాగస్వామ్యంతో బాగా ఆరంభించినప్పటికీ, భారత బౌలర్ల దాడిలో 210 పరుగులకే కుప్పకూలింది.2021లో ఓవల్‌లో సాధించిన విజయం భారత్‌కు స్ఫూర్తినిస్తుంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో జట్టు సిరీస్‌ను 2-2తో సమం చేయాలని ఆశిస్తోంది. ఓవల్‌లో భారత్‌కు రెండో టెస్ట్ విజయం 2021లో వచ్చినప్పటికీ, ఈ మైదానం ఎల్లప్పుడూ గట్టి పోటీని ఇస్తోంది. రోహిత్, గిల్, పుజారా వంటి ఆటగాళ్లతో అప్పుడు చూపించిన అద్భుత ప్రదర్శన ఈసారి కూడా భారత్ చేస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. దీంతో ఈ టెస్ట్ మ్యాచ్ ఉత్కంఠగా కొనసాగే అవకాశం ఉంది. ఎందుకంటే రెండు జట్లూ కూడా విజయం కోసం తీవ్రంగా పోరాడనున్నాయి.

## దివ్య చరితం




తాను పుట్టకముందే ప్రత్యర్థి హంపికి గ్రాండ్ మాస్టర్ హోదా.. ఎన్నో అంతర్జాతీయ టోర్నీలు గెలిచిన అనుభవం.. అయితేనేం, యువ కెరటం దివ్యా దేశ్‌ముఖ్ సంచలన ఆటతీరుతో అదరగొట్టింది. తనకంటే రెట్టింపు వయసున్న హంపిని ఓడించి.. వరల్డ్‌కప్ సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించింది. టీనేజ్‌లోనే అద్భుతం చేసిన 19 ఏళ్ల దివ్య.. 64 గళ్ల ఆటలో యువరాణిగా చెస్ ప్రపంచాన్ని శాసించేందుకు సిద్ధమైంది. బటూమి (జార్జియా): ఎంతో ఉత్కంఠగా సాగిన మహిళల వరల్డ్‌కప్ టైబ్రేక్‌లో 19 ఏళ్ల దివ్యా దేశముఖ్ అదరగొట్టింది. తెలుగు క్రీడాకారిణి కోనేరు హంపితో జరిగిన మెగా ఫైనల్లో సోమవారం జరిగిన టైబ్రేక్‌లో దివ్య 2.5-1.5తో విజయం సాధించింది. ఈ విక్టరీతో ప్రతిష్ఠాత్మక చెస్ వరల్డ్‌కప్ టైటిల్‌ను సొంతం చేసుకొన్న తొలి భారత, పిన్నవయస్కురాలిగా దివ్య చరిత్ర సృష్టించింది. అంతేకాదు.. గ్రాండ్ మాస్టర్ హోదాను కూడా దక్కించుకొంది. మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్స్, ప్రపంచకప్ మినహా అన్ని టైటిళ్లు నెగ్గిన హంపి.. చిరకాల స్వప్నానికి అడుగుదూరంలోనే నిలిచిపోయింది. విశ్వనాథన్ ఆనంద్ (2000, 2002) తర్వాత చెస్ వరల్డ్‌కప్ గెలిచిన భారత ప్లేయర్‌గా దివ్య రికార్డులకెక్కింది. హోరా హోరీగా: టైటిల్ ఫైట్‌లో తొలి రెండు క్లాసిక్ గేమ్‌లు డ్రా కావడంతో హంపి, దివ్య 1-1తో సమంగా నిలిచారు. నిర్ణాయక టైబ్రేక్‌లో తొలి రెండు ర్యాపిడ్ గేమ్‌ల సెట్‌లో తీవ్ర ఒత్తిడి మధ్య దివ్య 1.5-0.5తో హంపికి ఝలకిచ్చింది. ర్యాపిడ్ గేమ్-1లో ఇద్దరూ బలగాలను నడిపించారు. 81 ఎత్తులపాటు పోరాడినా ఈ గేమ్ డ్రాగా ముగిసింది. తెల్లపావులతో ఆడిన దివ్య కింగ్ పాన్ ఓపెనింగ్ చేయగా.. పెట్రోఫ్ డిఫెన్స్‌ను ఎంచుకొన్న హంపి తొలి ఎత్తులోనే డ్రాకు ప్రయత్నిస్తున్నట్టు అర్థమైంది.

## వచ్చేసింది యువరాణి

అంచనాలకు మించి రాణించడం.. అద్భుత ఆటతీరుతో అబ్బురపరచడం.. ఆమె నైజం. కీలక దశలో ఒత్తిడిని అధిగమించడం.. పరాజయం తప్పదనుకున్న చోట గెలిచి చూపించడం.. ఆమెకు అలవాటు. 18 ఏళ్లకే జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్ నెగ్గడం.. 19 ఏళ్లకే సీనియర్ ప్రపంచ కప్‌ను ముద్దాడడం.. పిన్న వయసులోనే ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికవడం.. ఇలా ఎన్నెన్నో ఘనతలు చిరుప్రాయంలోనే సొంతం చేసుకున్న దివ్యా దేశ్‌ముఖ్ పేరుకే టీనేజర్.. చెస్ బోర్డు ఎదురుగా ఉంటే తనదైన వ్యూహాలతో పావులు కదుపుతుంది.. ఎంత అనుభవమున్న ప్రత్యర్థినైనా గెలుపు ఎత్తులతో చిత్తు చేస్తుంది. అసాధారణ విజయాలతో ఇప్పుడు మహిళల చదరంగానికి యువరాణిగా పట్టాభిషేకం అందుకుంది.

అనుకోకుండా చెస్‌లోకి..: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన దివ్య తల్లిదండ్రులు జితేంద్ర, నమ్రత ఇద్దరూ డాక్టర్లు. ఐదేళ్ల వయసులో 2010లో దగ్గరలోని అకాడమీలో అక్కతో కలసి బ్యాడ్మింటన్‌లో కోచింగ్ కోసమని వెళ్లింది. అయితే, ఎత్తు తక్కువగా ఉండడంతో ఆమెను చెస్‌లో జాయిన్ చేశారు. క్రమంగా ఆటపై మక్కువ పెంచుకొన్న దివ్య రెండేళ్లలోనే పుదుచ్చేరిలో




జరిగిన అండర్-7 నేషనల్స్‌లో స్వర్ణం సాధించింది. 2013లో ఇరాన్‌లో జరిగిన పోటీల్లో అండర్-8 ఆసియా విజేతగా నిలిచిన దేశ్‌ముఖ్.. వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించే అవకాశం దక్కించుకొంది. 2014లో అండర్-10 వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత 40 సార్లు దేశానికి ప్రాతినిథ్యం వహించిన ఆమె.. 35 సార్లు పోడియం ఫినిష్ చేసింది.

## మరో ఆటగాడిని అనుమతించాలి



%మాంచెస్టర్: మ్యాచ్ సందర్భంగా క్రికెటర్ తలకు గాయమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అతడి స్థానంలో మరో ప్లేయర్‌ను అనుమతిస్తుంటారు. అలా వచ్చే ఆటగాడికి బ్యాటింగ్, బౌలింగ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే తల కాకుండా ఇతర శరీర భాగాలకు గాయాలైతే ఈ వెసులుబాటు లేదు. ఇదే విషయమై భారత జట్టు కోచ్ గంభీర్ స్పందించాడు. 'ఓ ఆటగాడి గాయం తీవ్రతను రెఫరీ, అంపైర్ పరిశీలించాక సబ్‌స్టిట్యూట్‌ను ఆడించడంపై నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో సిరీస్ హోరాహోరీగా సాగుతోంది. ప్రత్యర్థి 11 మంది ఆటగాళ్లతో ఆడుతుంటే మేం పది మందితో ఎలా పోరాడగలం?' అని గంభీర్ ప్రశ్నించాడు.

## ఆసియా కప్ 2025లో భారత్ పాకిస్తాన్ మ్యాచ్?పై ఏసీసీ క్లారిటీ..




ఇండియా %జం% పాకిస్తాన్ ఆసియా కప్ 2025 మ్యాచ్‌పై ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, ఈ హై వోల్టేజ్ పోరాటం యధాతథంగా కొనసాగనుంది. ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇండియా-పాకిస్తాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌పై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆసియా కప్ సెప్టెంబర్ 14, 2025న యూఏఈలో జరగనున్న ఈ మ్యాచ్ రద్దు కాదని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (%ూజజ%) స్పష్టం చేసింది.ఇది ద్వైపాక్షిక సిరీస్ కాదని, అనేక దేశాల టోర్నమెంట్‌లో భాగంగా జరిగే మ్యాచ్ మాత్రమేనని %ూజజ% సభ్యులు తెలిపారు. ఇండియా గేమ్ నుంచి తప్పుకుంటే, పాకిస్తాన్‌కు నేరుగా వాక్‌ఓవర్ లభిస్తుందన్నారు. అది మిగతా జట్లకు అన్యాయంగా మారుతుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.తగ్గనున్న ఆదాయం..ఈ టోర్నీలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌కు అత్యధిక ప్రేక్షకాదరణ ఉంటుంది. దీనివల్ల మిగతా 24 %ూజజ% సభ్య దేశాలకు వచ్చే ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. సోనీ నెట్‌వర్క్ ఈ టోర్నమెంట్ ప్రసార హక్కులను 8 ఏళ్లకు %ఖూణ% 170 మిలియన్‌తో పొందింది. అందులో ప్రధాన భాగం భారత్-పాకిస్తాన్ మ్యాచ్ నుంచే వస్తుంది. కాబట్టి ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ రద్దయ్యే అవకాశం లేదన్నారు.ప్రభుత్వ అనుమతి ముందేఇండియా వేదికగా ఉన్నప్పటికీ, ఆసియా కప్ 2025 యూఏఈలో జరగనుంది. టోర్నమెంట్‌కు సంబంధించిన ప్రభుత్వ అనుమతి ముందే లభించిందని సమాచారం. క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవియా ఇటీవలే ప్రకటించినట్టు, ఆయా దేశాల ఈవెంట్‌లలో పాకిస్తాన్‌తో భారత్ ఆడతుందనే విషయం ఇప్పటికే స్పష్టమైందని తెలిపారు.అధికారిక వర్గాల ప్రకారం..

ఇటీవల ఇంగ్లాండ్‌లో జరగాల్సిన ఇండియా-పాకిస్తాన్ లెజెండ్స్ మ్యాచ్‌ను సోషల్ మీడియా వ్యతిరేకత కారణంగా రద్దు చేశారు. దీంతో ఆసియా కప్ మ్యాచ్ కూడా రద్దవుతుందేమో అనే ఊహాగానాలు పెద్ద ఎత్తున వచ్చాయి. కానీ అధికారిక వర్గాలు మాత్రం అందుకు అవకాశం లేదని స్పష్టం చేశాయి

## శార్దూల్ అన్షుల్ కష్టమే

మాంచెస్టర్: నాలుగో టెస్టులో విఫలమైన పేసర్లు శార్దూల్ ఠాకూర్, అన్షుల్ కాంబోజ్‌లపై వేటు పడే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో గురువారం నుంచి జరిగే ఐదో టెస్టులో భారత్ పటిష్ఠ జట్టుతో బరిలోకి దిగాలనుకుంటోంది. ముఖ్యంగా బౌలింగ్ కూర్పుపై దృష్టిసారిస్తోంది. ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటర్లు ఉండాలనే ఉద్దేశంలో స్పెషలిస్ట్ బౌలర్ సేవలను కోల్పోవాల్సి వస్తోంది. 2014 తర్వాత ప్రత్యర్థికి 600ం పరుగులు సమర్పించుకున్న భారత్ ఈసారి ఎలాంటి తప్పూ చేయాలనుకోవడం లేదు. అన్షుల్ స్థానంలో ఆకాశ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ పోటీ పడనున్నారు. ఇక నాలుగో బౌలర్‌గా స్పిన్నర్ కుల్దీపను ఆడించే




అవకాశం ఉంది. మరోవైపు భారత జట్టు మాంచెస్టర్ నుంచి సోమవారం రైలులో లండన్‌కు చేరుకుంది. అలాగే నేటి మధ్యాహ్నం 2 గంటల నుంచి తమ ప్రాక్టీసను ఆరంభించనుంది.

# బిజినెస్



## హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు




దేశంలో నిన్నటి ధరలతో పోలిస్తే ఈరోజు బంగారం, వెండి ధరలు స్థిరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జులై 29, 2025న ఉదయం 6:10 గంటల సమయానికి, గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం వీటి ధరల్లో పెద్దగా మార్పు లేదు. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,920, 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,159గా ఉంది. వెండి ధర కిలోకు రూ.1,15,900 వద్ద మార్పులు లేకుండా స్థిరంగా కొనసాగుతోంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,920గా, 22 క్యారెట్ల బంగారం రూ.91,159గా ఉంది. వెండి ధర కిలోకు రూ.1,15,900గా నమోదైంది. ఈ ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, మార్కెట్ డిమాండ్ ఆధారంగా రోజు వారీ మార్పులు సంభవించవచ్చని గమనించాలి.

## పన్ను చెల్లింపు దారులకు గుడ్ న్యూస్.. ఐటీఆర్ గడువు పొడిగింపు..

పన్ను చెల్లింపుదారులకు గుడ్ న్యూస్ వచ్చింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ ఈ ఫైలింగ్ విధానంలో దాఖలు చేసిన ఆదాయపు పన్ను రిటర్న్‌ల ప్రాసెసింగ్ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది సాంకేతిక సమస్యల కారణంగా తప్పుగా చెల్లని రిటర్న్‌లను ఇప్పుడు చట్టపరమైన ప్రక్రియ ప్రకారం ధృవీకరించి, ప్రాసెస్ చేయనున్నారు. ఈ నిర్ణయం 2023-24 అసెస్‌మెంట్ సంవత్సరం వరకు దాఖలైన రిటర్న్‌లకు వర్తిస్తుంది. బెంగళూరులోని సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ వద్ద ఎలక్ట్రానిక్‌గా దాఖలైన ఆదాయపు పన్ను రిటర్న్‌లలో కొన్ని సాంకేతిక కారణాల వల్ల తప్పుగా చెల్లనివిగా గుర్తించబడ్డాయి. ఈ రిటర్న్‌ల ప్రాసెసింగ్ గడువు, ఉదాహరణకు 2023-24 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి 31.12.2024తో ముగిసింది. కానీ ఈ పరిస్థితి కారణంగా పన్ను చెల్లింపు దారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు %జదీఱ% కీలక నిర్ణయం తీసుకుంది. ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 119 ప్రకారం, %జదీఱ% తన అధికారాలను ఉపయోగించి, 31.03.2024 వరకు ఎలక్ట్రానిక్‌గా దాఖలైన రిటర్న్‌లను ప్రాసెస్ చేయడానికి గడువును పెంచింది. ఈ రిటర్న్‌లు




సాంకేతిక కారణాల వల్ల తప్పుగా చెల్లనివిగా గుర్తించబడినవి. ఇప్పుడు ఈ రిటర్న్‌లను చట్టపరమైన ప్రక్రియ ప్రకారం ధృవీకరించి, ప్రాసెస్ చేస్తారు. ఈ ప్రక్రియలో భాగంగా, సెక్షన్ 143(1) కింద ఇంటిమేషన్‌ను 31.03.2026 వరకు పన్ను చెల్లింపు దారులకు అవకాశం ఇచ్చారు.

## అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ 67000 కోట్లు




న్యూఢిల్లీ: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల వద్ద అన్‌క్లెయిమ్డ్ (ఎవరూ తమవిగా క్లెయిమ్ చేయని) డిపాజిట్ల మొత్తం కొండలా పేరుకుపోతోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఈ మొత్తం రూ.67,003 కోట్లకు చేరుకుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద ఉన్న సొమ్ము రూ.58,330.26 కోట్లు కాగా ప్రైవేట్ బ్యాంకుల వద్ద ఉన్న సొమ్ము రూ.8,673.72 కోట్లు. ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయం తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.19,329.92 కోట్లు), ప్రైవేటు బ్యాంకుల్లో ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.2,063.45 కోట్లు) వద్ద గరిష్ఠంగా ఈ నిధులున్నాయి. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించిన సమాచార లభ్యతను సరళం చేసేందుకు ఆర్‌బీఐ ఉద్గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు-గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్) పేరిట కేంద్రీయ వెబ్ పోర్టల్ ఒకటి ప్రారంభించింది. ఈ పోర్టల్ ద్వారా రిజిస్టర్డ్ వినియోగదారులు అన్ని బ్యాంకుల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల సమాచారాన్ని పొందవచ్చు. జూలై ఒకటో తేదీ నాటికి 8.59,683 మంది యూజర్లు ఈ పోర్టల్‌పై రిజిస్టర్ అయ్యారు. డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ స్కీమ్, 2014 కింద నిధి నిర్వహణతో పాటు ఆ డిపాజిట్లలోని సొమ్ము వినియోగానికి సంబంధించిన అంశాలు పరిశీలించేందుకు ఒక కమిటీ ఉంటుందని మంత్రి వెల్లడించారు. డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణకు, ఆర్‌బీఐ నిర్దేశకత్వం మేరకు ఈ ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించిన ఇతర అంశాలకు ఈ నిధిని వినియోగించవచ్చు.

## మీ పేరు మీద మరొకరు లోన్ తీసుకున్నట్టు అనుమానం ఉందా.. ఇలా చేయండి




ఇంటర్నెట్ డెస్క్: డిజిటల్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ మోసాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఆన్‌లైన్ స్కామ్‌లు, ఐడెంటిటీ చోరీ ఇతర సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయి. పేరు, అడ్రస్, ఆధార్, పాన్ నెంబర్ వంటి వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్లు చోరీ చేసి గుట్టుచప్పుడు కాకుండా లోన్‌లకు దరఖాస్తు చేస్తుంటారు. మరికొందరు ఏవేవో వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. మీ పాన్ కార్డు కూడా ఇలా దుర్వినియోగమై ఉండొచ్చన్న అనుమానం కలిగినప్పుడు ఏం చేయాలో ఈ కథనంలో చూద్దాం. నిపుణులు చెప్పే దాని ప్రకారం, మీ పాన్ కార్డును దుర్వినియోగ పరిచి ఎవరైనా రుణం పొందినట్టు అనుమానంగా ఉంటే ముందు క్రెడిట్ రిపోర్టును చెక్ చేసుకోవాలి. ఇందుకోసం సిబిల్, ఎక్స్‌పీరియన్, ఈక్వీఫాక్స్, సీఆర్ఐఎఫ్ హై మార్క్ వెబ్‌సైట్‌ల సాయం తీసుకోవచ్చు. వీటిల్లో రుణాల రికార్డులన్నీ ఉంటాయి. యూజర్ల అభ్యర్థన మేరకు ఉచితంగానే ఇవి క్రెడిట్ రిపోర్టును ఇస్తాయి. ఈ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించాలి. తప్పుడు అకౌంట్ వివరాలు, అనుమతి లేని లోన్ ఎంక్వైరీలు ఉన్నాయేమో చెక్ చేయాలి. అనుమానాస్పద సంస్థల లావాదేవీలు ఏమైనా కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. ఇక వ్యక్తిగత వివరాలు దుర్వినియోగమైనట్టు రూఢీ అయితే వెంటనే రిపోర్టులోని రుణదాతకు సమాచారం అందించాలి. ఆ రుణం మీరు తీసుకోలేదని స్పష్టంగా తెలియజేయాలి. ఈ లోన్ ప్రస్తావన ఉన్న క్రెడిట్ బ్యూరో వెబ్‌సైట్‌లో కూడా అధికారికంగా ఫిర్యాదు దాఖలు చేయాలి. స్థానిక పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ యూనిట్ విభాగంలో కూడా కంప్లెయింట్ చేయొచ్చు. పాన్ కార్డును కేవలం 18 ఏళ్లు పైబడిన వారికే కాకుండా మైనర్‌లకూ ఇస్తారు. కంపెనీలు, పార్టనర్‌షిప్ ఫర్మ్, ఎల్ఎల్‌పీ, ట్రస్టులు, సొసైటీ, అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్, బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్, భారత్‌లో ఆదాయం పొందే విదేశస్తులకూ పాన్ కార్డును జారీ చేస్తారు.

## మళ్లీ ద్విచక్ర వాహన మార్కెట్లోకి కైనెటిక్




న్యూఢిల్లీ: కైనెటిక్ ఇంజనీరింగ్ ద్విచక్ర వాహనాల విభాగంలోకి తిరిగి ప్రవేశించింది. ఒకప్పుడు అద్భుతమైన ప్రజాదరణ పొందిన కైనెటిక్ డీఎక్స్ స్కూటర్‌లో విద్యుత్ వెర్షన్‌ను సోమవారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ స్కూటర్ ఒకసారి చార్జింగ్ చేస్తే 116 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. కైనెటిక్ డీఎక్స్, డీఎక్స్ ప్లస్ పేరుతో అందుబాటులో ఉండనున్న ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ధర వరుసగా రూ.1,11,449, రూ.1,17,499 (పుణె ఎక్స్‌షోరూమ్) గా ఉన్నాయి. కాగా ఉత్పత్తిని, సేల్స్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాబోయే 18 నెలల కాలంలో రూ.177 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నామని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ అజింక్యా ఫిరోడియా ఈ సందర్భంగా చెప్పారు. అప్పటికి 6-8% మార్కెట్ వాటాతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగంలో మూడు అగ్రగామి కంపెనీల్లో ఒకటిగా నిలవాలన్నది తమ ఆకాంక్ష అన్నారు. దశల వారీగా ఉత్పత్తిని పెంచుతూ ఆ సమయానికి 1.5 లక్షల యూనిట్ల అమ్మకాల లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నట్టు చెప్పారు.

## రూ 12000 లక్షల కోట్ల చెల్లింపులు




న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల్లో భారత్ దూసుకెళ్తోంది. గత ఆరేళ్లలో (2019-20 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు) రూ.12,000 లక్షల కోట్లకు పైగా విలువైన 65,000 కోట్లకు పైగా డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు జరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు వెల్లడించారు. దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని మరింత పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), ఫిన్‌టెక్‌లు, బ్యాంక్‌లు, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సంబంధిత వర్గాలందరితో కలిసి పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. చిన్న నగరాలు, ఈశాన్య రాష్ట్రాలు, జమ్ము కశ్మీర్‌లో డిజిటల్ చెల్లింపుల స్వీకరణకు అవసరమైన

## కోటక్ షేర్లు పడేశాయ్




ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయి దాదాపు రెండు నెలల (జూన్ 4 తర్వాత) కనిష్ఠ స్థాయిలో ముగిశాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 687 పాయింట్లు క్షీణించింది. చివరికి 572.07 పాయింట్ల నష్టంతో 80,891.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156.10 పాయింట్లు కోల్పోయి 24,680.90 వద్ద క్లోజైంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు భారీగా క్షీణించడంతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ఇందుకు ప్రధాన కారణం. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 నష్టపోగా.. గత వారాంతంలో నిరాశాజనక త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన కోటక్ బ్యాంక్ షేరు ఏకంగా 7.50 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006